
పీయూ స్నాతకోత్సవ సభలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


స్నాతకోత్సవ వేడుకలకు హాజరైన పాలమూరు కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి


కలెక్టరేట్ ఆవరణలో మొక్కనాటి మట్టిపోస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిత్రంలో పాలమూరు ఎంపీ డీకే అరుణ

విద్యతోనే.. స్వేచ్ఛ, ధైర్యం..!

- దేశాభివృద్ధిలో యువతదే క్రియాశీలక పాత్ర
- విలువలు కాపాడటంలో యువత చాంపియన్లుగా మారాలి
- దశాబ్ద కాలంలో పాలమూరు వర్సిటీ అభివృద్ధి ప్రశంసనీయం
- పీఎం ఉషా ద్వారా రూ. 100 కోట్ల నిధులు రావడం గర్వకారణం
- మౌలిక వసతులు, విద్యాసంస్కృతి మెరుగుపడితే ఉన్నత శిఖరాలు
- పీయూ నాలుగో స్నాతకోత్సవంలో గవర్నర్, పీయూ చాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ

మహబూబ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : స్వామి వివేకానంద చెప్పినట్లు విద్యతోనే స్వేచ్ఛ, ధైర్యం వస్తుందని, విద్యతో అజ్ఞానపు చీకట్లను తొలగించి దేశాభివృద్ధికి టార్చ్‌బేరర్‌లా మారాలని, ప్రస్తుత యువత పాత్ర ఇందులో క్రియాశీలకమని రాష్ట్ర గవర్నర్, పీయూ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. పాలమూరు యూనివర్సిటీ నాలుగో స్నాతకోత్సవానికి గురువారం హాజరైన ఆయన ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఎంఎస్ఎన్ లాబొరేటరీల అధినేత డాక్టర్ మన్నె సత్యనారాయణరెడ్డికి వర్సిటీ తొలి గౌర వ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అలాగే వర్సిటీ నుంచి 12 మందికి డాక్టరేట్ పట్టాలు, 83 మందికి బంగారు పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నాతకో త్సవం అనేది కేవలం పట్టాల పంపిణీ వేడుక మాత్రమే కాదని, ఇది విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల సేవ, తల్లిదండ్రుల త్యాగాలను స్మరించుకునే సందర్భంగా పేర్కొన్నారు. ఇక్కడ నేర్చుకున్న విద్యను వారు ఎంచుకున్న రంగాల్లో రాణిం చడానికే కాకుండా మానవత్వం పెంపునకు, తమ జ్ఞానాన్ని సమాజానికి పంచడానికి కృషి చేయాలని సూచించారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పినట్లుగా జ్ఞానసముపార్జన అనేది మానవ ఉనికిలో అంతిమ లక్ష్యమై ఉండాలని, ఇది జీవితకాల ప్రయత్నంగా కొనసాగాలని అన్నారు. అమితాబ్ ఘోష్ మాటలను గుర్తుచేస్తూ పిల్లల చదువు ఉద్యోగం కోసం ప్రారంభించినప్పటికీ దానితో ఆగిపోవద్దని, విద్య అసలు లక్ష్యం ఉద్యోగం మాత్రమే కాదని అన్నారు.

విద్య వ్యక్తిత్వ వికాసానికి, విలువలను పెంపొందించడానికి, జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఉపయోగపడాలని కోరారు. నేర్చుకోవడానికి (జ్ఞానార్థ ప్రవేశం) విశ్వవిద్యాలయానికి వచ్చిన విద్యార్థులు సేవ చేయడానికి (సేవార్థ ప్రస్థానం) వెళ్లాలని అన్నారు. దశాబ్ద కాలంలో పాలమూరు యూనివర్సిటీ అటు మౌలిక వసతులపరంగా ఇటు అకాడమిక్స్

(మిగతా 4వ పేజీ లో..)

క్షయవ్యాధి రహిత దేశంగా తీర్చి దిద్దాలి : గవర్నర్



మహబూబ్‌నగర్ కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న 1441 మంది చెంచుల సమగ్ర, సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు చివరి లబ్ధిదారుడి వరకు చేరాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న ప్రధానమంత్రి జన్మన్, దర్తి ఆబా అభియాన్ పథకాల ద్వారా, స్వయం ఉపాధి, సౌర విద్యుత్, పక్కా ఇళ్లు, విద్య తదితర పథకాలు చెంచులకు అందేవిధంగా చూడాలన్నారు.

అన్ని గ్రామాల్లో క్షయ వ్యాధి ముందస్తు పరీక్షలు నిర్వహించి క్షయ రహిత రాష్ట్రంగా రూపొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమాజంలో ఉన్న మూఢాచారాలు, రుగ్మతలను పారదోలడంలో సామాజిక కార్యకర్తలు, ప్రముఖులు, కవులు, రచయితలు, కళాకారు లు వీధి నాటకాలు, జానపద గేయాలు

(మిగతా 4వ పేజీ లో..)

ఎం.సత్యనారాయణరెడ్డికి గౌరవ డాక్టరేట్

- గవర్నర్ చేతులమీదుగా అందుకున్న పారిశ్రామికవేత్త

పాలమూరు యూనివర్శిటీ (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పాలమూరు జిల్లాకు వన్నెతెచ్చి, యువతకు ఉపాధి కల్పించిన పారిశ్రామిక వేత్త మన్నె సత్యనారాయణ రెడ్డికి మొట్ట మొదటి గౌరవ డాక్టరేట్ పట్టాను పీయూ నాల్గో స్నాతకోత్సవంలో భాగంగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్‌లు అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం గురుకుంట గ్రామానికి చెందిన మన్నె సత్యనారాయణరెడ్డి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు తెలంగాణ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఆయనకు పీయూ గౌరవ డాక్టరేట్‌ను అందించడంతో పలువురు విద్యా


గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న ఎం సత్యనారాయణరెడ్డి

వంతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం ఎంఎస్ఎన్‌తో సెల్ఫీలు దిగడానికి గోల్డ్ మెడల్స్ అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పీయూ విద్యార్థులు పోటీపడ్డారు.

ప్రజాస్వామ్యబద్ధంగా జిల్లా అధ్యక్షుల ఎంపిక

- రాహుల్ జోడో యాత్రలో అన్ని వర్గాల అభిప్రాయాలు
- పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నారాయణస్వామి

గద్వాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ నిర్వహించిన జోడో యాత్రలో అన్ని వర్గాల ప్రజలను కలుసుకున్నారని, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రజాస్వామ్య బద్ధంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్లు స్వీకరిస్తున్నామని పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. అభిప్రాయ సేకరణలో భాగంగా గురువారం పట్టణంలోని హరితహోటల్‌లో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో డీసీసీ అధ్యక్షులుగా 10,15 ఏళ్ల ఒక్కరే కొనసాగారని, దీనిని మార్చేందుకు పారదర్శకంగా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. రాహుల్ గాంధీ జోడో యాత్రలో రైతులు, యువకులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులు, వృత్తిదారులు ఇలా అనేక మందిని కలిసి వారి నుంచి తీసుకున్న సమాచారం మేరకే దేశమంతటా పారదర్శకంగా డీసీసీ అధ్యక్ష పదవికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరించారు. ఇప్పటికే నాగర్ కర్నూల్ జిల్లా నుంచి 31, వనపర్తి జిల్లా నుంచి 19 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. గద్వాల జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో సమావేశాలు నిర్వహించి తీసుకున్న దరఖాస్తులను ఏఐసీసీకి పంపిస్తామని ఆయన వివరించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన అన్ని వర్గాలను సంతృప్తి పరుస్తున్నదని వివరించారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని కులగణను పూర్తి చేశారని వివరించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని తెలిపారు. బీజేపీ ఉన్నత వర్గాల మేలును కోరే పార్టీ అని విమర్శించారు. ఓట్ చోరీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన పార్టీ అని విమర్శించారు. అందుకే ఓట్ చోరీపై కాంగ్రెస్ పార్టీ సంతకాల సేకరణ చేస్తున్నదని వివరించారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి సంధ్యారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి సరిత, ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ రాజీవ్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తిరమలేష్, అధికార ప్రతినిధి షేక్షావలి, సీనియర్ నాయకులు డీఆర్ శ్రీధర్, ఇసాక్, శంకర్ నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ పరిహారం చెల్లించాలి

- ముంపు రైతుల ఆందోళన


ఖిల్లాఘణపురం మార్కెట్ యార్డు ఆవరణలో సమావేశమైన గణప సముద్రం రిజర్వాయర్ ముంపు బాధిత రైతులు

4

సమష్టి కృషితోనే చేనేత క్లస్టర్ అభివృద్ధి

- రాష్ట్ర నాబార్డ్ సీజీఎం ఉదయ్ భాస్కర్
- హైదరాబాద్‌లో ప్రారంభమైన అమరచింత క్లస్టర్ బ్రాంచ్

అమరచింత, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల సమష్టి కృషితోనే అమరచింత హ్యాండ్లూమ్ క్లస్టర్ అభివృద్ధిలో దూసుకుపోతోందని రాష్ట్ర నాబార్డ్ సీజీఎం ఉదయ్ భాస్కర్ అన్నారు. గురువారం హైదరాబాదులోని పంజాగుట్ట ప్రాంతంలో అమృత్‌మాల్‌లో అమరచింత హ్యాండ్లూమ్ క్లస్టర్ బ్రాంచ్ ఓపెనింగ్ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతకార్మికుల అభివృద్ధి కోసం హ్యాండ్ క్లస్టర్‌ను ముందుకు తీసుకెళ్లడానికి నాబార్డ్ పూర్తిగా సహకరిస్తుందని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోనే అమరచింత చేనేత హ్యాండ్లూమ్ కంపెనీ విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అడ్వైజర్ శ్రావణ్‌కుమార్ శర్మ, హిండి రూట్స్ డైరెక్టర్ డైరెక్టర్ అభిషేక్ మధు, అమరచింత చేనేత కంపెనీ సీఈవో మహాకాళి చంద్రశేఖర్, మౌనిక అశోక్, రాధ తదితరులు పాల్గొన్నారు.


హైదరాబాదులో అమరచింత క్లస్టర్ మాల్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర నాబార్డ్ సీజీఎం ఉదయ్‌కుమార్

ఫేక్ లింకులతో మోసం చేసిన ముఠా అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీఐ కృష్ణయ్య

5

కురుమూర్తి జాతరకు వేళాయే..

ప్రధాని పర్యటనతో ట్రాఫిక్ ఆంక్షలు

- అలంపూరు చౌరస్తాలో ఏపీ పోలీసుల విధులు
- కర్నూలు వైపు వెళ్లే వాహనాల దారి మళ్లింపు
- జాతీయ రహదారిపై పలుచోట్ల ట్రాఫిక్ జామ్

5


బెంగళూరు, అనంతపూర్ వైపు వాహనాలను అయిజ వైపు దారి మళ్లించడంతో రాయచూరు మార్గంలో ట్రాఫిక్ జామ్

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 118.00
హోల్ సేల్	: 121.00
డ్రెస్డ్	: 203.00
స్కిన్ లెస్	: 231.00

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

- వనపర్తి జిల్లాలో నెల రోజుల పాటు కొనసాగనున్న కార్యక్రమం
- రైతులు సద్వినియోగం చేసుకోవాలంటున్న పశువైద్య అధికారులు
- జిల్లాలో 1.50 లక్షలకు పైగా పశువులు


పెబ్బేరు మండలం ఏటిగడ్డ శాఖాపురంలో పశువులకు గాలికుంటు నిరోధక టీకాలు వేస్తున్న వైద్యులు

వనపర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పశువులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతీ ఆరు నెలలకు ఒకసారి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి వచ్చే నెల 14 వరకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఏడో విడతగా గాలికుంటు నిరోధక టీకాలను వేయనున్నారు. అందుకోసం ఏర్పాట్లు చేశారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షలకు పైగా నల్ల, తెల్లజాతి పశువులు ఉన్నాయి. వీటన్నింటికి గాలికుంటు నిరోధక టీకాలు వేయనున్నారు. అందుకోసం పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో 28 పశువైద్య బృందాలను ఏర్పాటు చేశారు. మండల పశువైద్యాధికారి ఆధ్వర్యంలో పశువైద్య సహాయకుడు, అటెండర్, గోపాల మిత్రలు టీకాలు వేస్తారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు టీకా కార్యక్రమం కొనసాగుతోందని ఆయన తెలిపారు.

వ్యాధి లక్షణాలు

గాలికుంటు వ్యాధి సోకిన పశువులు, బక్కచిక్కి అల్సర్ బారినపడతాయి. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వరం ఎక్కువగా ఉంటుంది. నోరు, పెదాలు, నాలుకతో పాటు కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. మేత, నీళ్లు సరిగా తీసుకోవు. వ్యాధి నిరోధక శక్తి తగ్గి పశువులు, దూడలు చనిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో వ్యాధి సోకిన పశువులకు ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించాలి. వ్యాధి సోకిన పశువులను ఇతర పశువులకు దూరంగా ఉంచాలి. వారానికి ఒకసారి కొట్టంలో సున్నం చల్లి క్రిమికీటకాల నివారణకు చర్యలు చేపట్టాలి.

ఉచితంగా టీకాలు వేస్తాం



రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ నెల 15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రారంభించాం. షెడ్యూల్ ప్రకారం నవంబరు 14 వరకు అన్ని గ్రామాల్లోని పశువులకు ఉచితంగా టీకాలు వేస్తాం. మేకలు, గొర్రెలు పశువులకు ఎలాంటి వ్యాధులు సోకినా పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలి.

- వెంకటేశ్వర్‌రెడ్డి, పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి

ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసం పెంచాలి

తెలకపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెంచాలని కలెక్టర్ బదావత్ సంతోష్ వైద్యులకు సూచించారు. గురువారం తెలకపల్లి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. ఫార్మసీలోని మందుల స్టాక్, రోగులకు అందిస్తున్న వైద్యం తదితర వివరాలను పరిశీలించారు. కలెక్టర్ వచ్చిన సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవికుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యానికి అధిక నిధులు ఖర్చు చేస్తోందని తెలిపారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. సేవ, శుభ్రత, ఔషధాల లభ్యత, ప్రసూతి సేవలు, అత్యవసర చికిత్స వంటి అంశాల్లో ఎటువంటి లోపం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని, ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖప్రసవం అయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా తెలకపల్లి జడ్పీహెచ్ఎస్‌ను, గౌరెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. నిజమైన లబ్ధిదారులకే ఇళ్లు మంజూరు చేయాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ జాకీర్ అలీ, హెచ్ఎం శోభన్‌బాబు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.


పీహెచ్‌సీ రిజిష్టర్‌లో నమోదు చేసిన రోగుల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

డోర్నకల్-గద్వాల కొత్త రైల్వేలైన్ మంజూరు చేయండి

- కేంద్ర మంత్రికి ఎంపీ మల్లురవి విజ్ఞప్తి

నాగర్‌కర్నూల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్, హైదరాబాద్ రైల్వే డివిజన్లలో డోర్నకల్, శ్రీరామ్‌నగర్ మధ్య కొత్త రైల్వేలైన్ నిర్మాణం చేపట్టాలని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రైల్వేశాఖ మంత్రి, జనరల్ మేనేజర్లను గురువారం ఢిల్లీలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సికింద్రాబాద్ డివిజన్‌లోని డోర్నకల్, హైదరాబాద్‌లోని శ్రీరామ్‌నగర్ మధ్య కొత్త రైల్వేలైన్ నిర్మిస్తే సింగరేణి నుంచి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులకు ముడి పదార్థాల సరఫరా మెరుగుపడుతుందని వినతి పత్రంలో కోరారు. డోర్నకల్ స్టేషన్ సికింద్రాబాద్, విజయవాడ లైన్ అండ్ ప్రాసెస్ వయా మర్రిపేట్ ఖమ్మం జిల్లా మోతే, సూర్యాపేట నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి మీదుగా ప్రయాణ రవాణా సౌకర్యం సౌకర్య వంతంగా మారుతుందని కూడా మల్లురవి తన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ రైల్వేలైన్ నిర్మాణం పూర్తైతే సింగరేణి నుంచి కర్ణాటకలోని థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లకు ముఖ్యంగా రాయచూర్, టీపీఎస్ దూరాభారం తగ్గుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ రైల్వేలైన్ కనెక్టివిటీ ముఖ్యంగా తెలంగాణలోని నైరుతి, ఈశాన్య ప్రాంతాన్ని అనుసంధానించడంలో కీలక భూమిక పోషిస్తుందని దీనికి వెంటనే పరిపాలనపరమైన ఆమోదాన్ని తెలియజేయాలని కోరారు.



గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ జీఎన్ శ్రీనివాస్

ఉత్సాహంగా స్నాతకోత్సవం

- సందడిగా మారిన యూనివర్సిటీ
- 83 మందికి గోల్డ్ మెడల్స్, 12 మంది పీహెచ్‌డీ పట్టాలు అందించిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ
- భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పాలమూరు యూనివర్సిటీ నాల్గవ స్నాతకోత్సవం కేరింతల నడుమ ఉత్సాహంగా సాగింది. పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన వేడుకలకు చాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ముఖ్యఅతిథిగా ఎంఎస్ఎన్ గ్రూప్ కంపెనీ వ్యవస్థాపకుడు మన్నె సత్యనారాయణరెడ్డి, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఆడిటోరియంలో సీటింగ్ సదుపాయం తక్కువగా ఉండడంతో ముఖ్యఅతిథులు, అధికారులు, పట్టాలు పొందే విద్యార్థులను మాత్రమే అనుమతించారు. మిగతా విద్యార్థులు, తల్లిదండ్రులందరూ కార్యక్రమం వీక్షించేందుకు ఆయా విభాగాలవద్ద ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రత్యక్షప్రసారం చేశారు. కార్యక్రమానికి కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ జానకి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, పూర్వ వీసీలు, డీన్‌లు, హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణం చేస్తున్న గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు



పతకం పొందిన ఆనంద వేళ

స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీలో సందడి నెలకొంది. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు తల్లిదండ్రులతో క్యాంపస్ కళకళలాడింది. పతకాలు అందుకున్న విద్యార్థులు తమ లక్ష్యం సాధించిన ఆనందంలో కేరింతలు కొట్టారు. తల్లిదండ్రులు, స్నేహితులతో కలిసి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

యూనివర్సిటీకి ఉదయం 11 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేరుకున్నారు. యూనివర్సిటీ వీసీ శ్రీనివాస్, కలెక్టర్ విజయేందిర బోయి, మన్నె సత్యనారాయణరెడ్డి, ఎస్పీ జానకి, రిజిస్ట్రార్ పూస రమేష్ బాబు గవర్నర్‌కు పూల బొకేతో ఘనస్వాగతం పలికారు. పోలీసులు గవర్నర్‌కు గౌరవ వందనం చేశారు. అధికారులు మర్యాదపూర్వకంగా వర్సిటీ లాంఛనాలతో స్నాతకోత్సవ కార్యక్రమానికి చేరుకున్నారు. అనంతరం వర్సిటీ టాపర్లు 12 మందికి పీహెచ్‌డీ పట్టాలు, 83 మందికి బంగారు పతకాలు, 2,809 మందికి పీజీ, 18,666 మందికి యూజీ డిగ్రీలు అందజేశారు. ఉదయం 11.10కి మొదలైన కార్యక్రమం మధ్యాహ్నం 12.30కి పూర్తికాగానే, తిరిగి మరోసారి పోలీసులు గవర్నర్‌కు గౌరవ వందనం సమర్పించారు.



సర్టిఫికెట్‌పై సంతకం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

భారీ బందోబస్తు

మహబూబ్‌నగర్: పాలమూరులో గవర్నర్ పర్యటన సందర్భంగా పోలీసులు జిల్లా కేంద్రంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పర్యటన పూర్తయ్యే వరకు జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ జానకి పర్యవేక్షించారు. ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నారు. అన్ని విభాగాల సమన్వయంతో బందోబస్తును విజయవంతంగా పూర్తి చేయడంతో సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

పీహెచ్‌డీ అందుకున్న వారు..



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వీసీ జీఎన్ శ్రీనివాస్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న రుఖ్యాబాను



కే.సంజీవ్ కుమార్



కే.సంధ్య



రాజశ్రీనాథ్



డీ.వెంకటేశ్



శ్రీనివాస్ మేకల



ఏ.చిట్టమ్మ



విజయ్ కుమార్



తంగలిపల్లి స్వాతి



రితిక బాజాజ్



జీ. విజయలక్ష్మి



సంధ్యరాణి

విద్యతోనే స్వేచ్ఛ, ధైర్యం..!

(3వ పేజీ తరువాయి..)

పరంగా సాధించిన ప్రగతిని చూస్తే విశ్వవిద్యాలయాలను దేశ ఆధునిక ఆలయాలని నిరూపిస్తున్నారని చెప్పారు. యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు చేపడుతున్న మిలియన్ ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్, గ్రామాల దత్తత మనసును హత్తుకుంటున్నాయని వివరించారు. అలాగే రాష్ట్రంలో పీఎం ఉషా పథకం కింద రూ. 100 కోట్ల నిధులు సాధించినందుకు పీయూ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. న్యాక్ సెకండ్ సైకిల్ కూడా పూర్తిచేయడం ద్వారా వైస్ చాన్స్‌లర్, అధ్యాపకులు, విద్యార్థులు తమ వర్సిటీ పట్ల అంకితభావాన్ని నిరూపించుకున్నారని అన్నారు. విద్యార్థులు ప్రతీ ఒక్కరు ఒక్క మొక్క నాటి దాన్ని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పాలమూరు యూనివర్సిటీ తన అక్రిడిటేషన్, మూల్యాంకన వ్యవస్థలను మెరుగుపరుచుకోవడం కోసం నిరంతరం కృషి చేయాలని, వర్సిటీకి విశ్వసనీయత మాత్రమే కొలమానం అని, అది అందించే డిగ్రీలు కాదని గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రస్తుత యువత పర్యావరణ, సాంస్కృతిక విలువలను కాపాడటంలో ఛాంపియన్ల పాత్ర పోషించాలని కోరారు. కేవలం అకాడమిక్స్ మాత్రమే కాకుండా జాతీయభావం, సేవాభావం పెంచుకోవాలని అన్నారు. ప్రస్తుత రోజుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడానికి ఇష్టపడుతున్నారన్నారు. వారిని సరైన మార్గంలో నడిపించే బాధ్యత వర్సిటీలపైనే ఉంటుందని అన్నారు. దీనికి అకాడమిక్ కల్చర్, మౌలిక వసతులు పెంపొందించాల్సి ఉంటుందని అన్నారు. యూనివర్సిటీలు, తల్లిదండ్రులు విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకోవాలని, పెరుగుతున్న మాదక ద్రవ్య వినియోగం యువత ఆత్మకే ముప్పుగా పరిణమిస్తోందని, ఇలాంటి చర్యలపై అవగాహన కల్పించాలని అన్నారు. వర్సిటీల్లో పరిశోధనలు పెంచాలని, ప్రభుత్వం, పారిశ్రామిక కంపెనీలతో అనుసంధానమైన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జాతీయ విద్యా విధానం ప్రస్తుతం చాలా బాగుందని, ప్రధాని నరేంద్రమోదీ అన్నట్లు దేశాభివృద్ధి అనేది విద్యార్థులు చదువుకోవడంలోనే ఉన్నదని అన్నారు. తల్లులు, ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకంగా ఉంటుందని దేశ చరిత్ర చెబుతోందని, జిజాయాబాయి శివాజీ మహారాజ్‌ను ధైర్యశాలిగా, వీరుడిగా మార్చారని, ఇయాదురై దేశ మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా ఏపీజే అబ్దుల్ కలాంను దేశానికి అందించారని గుర్తుచేశారు.

- దేశాభివృద్ధిలో ప్రస్తుత యువతదే క్రియాశీలకమైన పాత్ర
- పీయూ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పీయూ వీసీ శ్రీనివాస్



మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఈ నేల పుత్రుడిగా గర్వంగా ఉంది

- డాక్టర్ మన్నె సత్యనారాయణరెడ్డి, ఎంఎస్ఎన్ లాబొరేటరీల అధినేత

ఈ రోజు పాలమూరు యూనివర్సిటీకి రావడం తనకు అపారమైన ఆనందాన్ని ఇస్తోందని ఎంఎస్ఎన్ లాబోరేటరీల అధినేత డాక్టర్ మన్నె సత్యనారాయణరెడ్డి అన్నారు. యూనివర్సిటీ నుంచి తొలి గౌరవ డాక్టరేట్ అందుకున్న అనంతరం ఆయన ప్రసంగించారు. వర్సిటీ విద్యా జీవితంలో అత్యంత పవిత్రమైన సందర్భాల్లో స్నాతకోత్సవం ఒకటని అన్నారు. ఇది విద్యార్థుల విజయాలకు మాత్రమే కాకుండా వారిని మార్గనిర్దేశం చేసి పెంచిపోషించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల అవిశ్రాంత అంకితభావానికి వేడుక అన్నారు. ఎంఎస్ఎన్ చైర్మన్‌గానే కాకుండా పాలమూరు నేల బిడ్డగా గర్వంగా ఉన్నదని, ఈ నేల తనను నిత్య కృషీవలుడిగా కష్టించి, సాధించాలనే కసిని పెంచిందన్నారు. ఒకప్పుడు వలసలకు ప్రసిద్ధి చెందిన ఈ భూమి ఇప్పుడు విద్య, ఆరోగ్య, పరిశ్రమల పురోగతికి గుర్తింపు పొందుతోందని అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయం ఈ పరివర్తకు చిహ్నంగా నిలుస్తుందన్నారు. ఈ జిల్లా నుంచి వచ్చిన వ్యక్తిగా పీయూ అభివృద్ధికి దోహదపడటం గౌరవంతో కూడిన బాధ్యతగా పేర్కొన్నారు. వర్సిటీ అభివృద్ధికి రూ. 12 కోట్ల విరాళం ప్రకటించారు. పాలమూరు భవిష్యత్ నేడు పట్ట భద్రులవుతున్న యువ గ్రాడ్యుయేట్ల చేతుల్లో ఉన్నదని అన్నారు.

పీయూ అభివృద్ధికి మరింత కృషి

- జీఎన్ శ్రీనివాస్, వైస్ చాన్స్‌లర్, పాలమూరు యూనివర్సిటీ

పాలమూరు యూనివర్సిటీ 2008లో చట్టం ద్వారా ఉస్మానియా విశ్వవిద్యాలయం పీజీ కళాశాల నుంచి ఉద్భవించిందని, ఇక్కడి ప్రాంత విద్యార్థులకు సమీపంలో విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన పీయూను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. వర్సిటీ నాలుగో స్నాతకోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రగతిని వివరించారు. గత రెండు సంవత్సరాల్లో విద్యా, పరిశోధన, మౌలిక సదుపాయాల రంగాల్లో గణనీయమైన పురోగతిని సాధించామని తెలిపారు. ప్రస్తుతం క్యాంపస్ కళాశాలలు, మూడు పీజీ సెంటర్లు, 24 కోర్సులు కొనసాగుతున్నాయని, ఇంజనీరింగ్ కళాశాల, లా కాలేజీ, కొత్త హాస్టళ్లు పరిశోధన కేంద్రాల వంటి ప్రాజెక్టులు, రూ. 100 కోట్లు పీఎం ఉషా పథకం కింద వచ్చి వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. ఇప్పటివరకు 121 మంది పరిశోధక విద్యార్థులు ప్రవేశం పొందారని, ఈ సంవత్సరం 12 మంది డాక్టరేట్ పట్టాలు, 83 గోల్డ్ మెడల్స్, విద్యా పురస్కారాలు ప్రదానం చేశామని తెలిపారు. విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్, క్రీడా, పర్యావరణ, సాంస్కృతిక రంగాల్లో విద్యార్థుల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. పాలమూరు విశ్వవిద్యాలయం తెలంగాణలో అత్యంత వేగంగా ఎదుగుతున్న విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా నిలుస్తుందని గర్వంగా ప్రకటించారు.

కార్యక్రమం అనంతరం పాలమూరు యూనివర్సిటీ పూర్వ వీసీ ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, ప్రస్తుత వీసీ జీఎన్ శ్రీనివాస్‌తో కలిసి యూనివర్సిటీలోని సింథటిక్ ట్రాక్, పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

క్షయవ్యాధి రహిత దేశంగా తీర్చిదిద్దాలి : గవర్నర్

(3వ పేజీ తరువాయి..)

రచనల, ద్వారా అవగాహన కల్పించి సమాజిక రుగ్మతలను, క్షయ వ్యాధిని రూపుమాపడంలో తమవంతు కృషి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు వినూత్న కార్యక్రమాల ద్వారా చెంచులు, ఆది వాసీ మహిళలను మహిళ సంఘాలతో చేర్చుకుంటూ వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని కోరారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ మహబూబ్‌నగ ర్ జిల్లా విశిష్టత, ప్రముఖ పర్యాటక స్థలాలు, విద్య, వైద్యం, వివిధ శాఖల ద్వారా సాధించిన అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం

కలెక్టరేట కార్యాలయానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతా ప్, మధుసూదన్‌నాయక్‌లు ఘన స్వాగతం పలికారు. అనంతరం పో లీసు గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులచే నిర్వహించి సాం స్కృతిక కార్యక్రమాలను తిలకించారు. తర్వాత గవర్నర్ గ్రామీణాభివృ ద్ధి శాఖ, మెప్మా, వైద్యశాఖ, రెడ్‌క్రాస్ సొసైటీ, మహిళా శిశు సంక్షేమ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద చెంచులకు ఆరోగ్య పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేసిన మొబైల్ వై ద్య వాహనాన్ని గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు.

మొక్క నాటిన గవర్నర్

కలెక్టరేట్ ఆవరణలో తన గుర్తుగా ఓ మొక్కను గవర్నర్ నాటి నీ ళ్లు పోశారు. మొక్కలను పెంచే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నా రు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందన్నా రు. కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, గవర్నల్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, ఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ డి. జానకి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ పరిహారం చెల్లించి ఆదుకోవాలి

» ముంపు రైతుల ఆందోళన

ఖిల్లాఘణపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా ఖిల్లాఘ ణపురం మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువులో భూములు కోల్పోతున్న రైతుల పంట రుణాలు చెల్లించాలని బ్యాంకర్లు ఒత్తిడి తేవడంతో గురువారం మార్కెట్ యార్డులో సమావేశమయ్యారు. ముంపు బాధిత రైతుల భూ పట్టాదారు పాసు పుస్తకంలో భూములు తొలగించడంతో బ్యాంకర్లను పంట రుణాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అంగీకార పత్రాలు తెలపడంతో భూ పరిహారం చెల్లించకుండా భూములు తొలగించారని తెలిపారు. ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించిన తర్వాత బ్యాంకర్లకు రుణాలు చెల్లిస్తామ ని అన్నారు. ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నల్లమద్ది రవీందర్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, పంతుల మధుకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జానకి రాములు, బెస్త గోపాల్, శ్రీనివాసులు, శేషయ్య, శరవంద తదితరులు పాల్గొన్నారు.

19న ఉమ్మడి జిల్లా యోగా జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగా టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను ఈ నెల 19న నగరంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాములు, బాలరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8 నుంచి 18 ఏళ్ల, ఆపై విభాగంలో ఎంపికలు ఉంటాయని, ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని కోరారు.

మాజీ సర్పంచ్‌కు తీవ్ర గాయాలు

వెల్దండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని పెద్దాపూర్ సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాన్‌గాట్‌తండా మాజీ సర్పంచ్ పత్యానాయక్ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆమనగల్లు నుంచి ద్విచక్రవాహనంపై గ్రామానికి వెళ్తుండగా, పత్యానాయక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో పత్యానాయక్ తీవ్రంగా గాయపడగా స్థానికులు అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం యెన్నం ఆస్పత్రికి తరలించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



గట్టు మండలం ఆలూరు ప్రధాన రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు

గట్టు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో తాగునీరు రావడం లేదని విద్యార్థులు రోడ్డుపై బైఠాయించిన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని ఆలూరు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఆలూరు ఉన్నత పాఠశాలలో రెండు నెలలుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు నిత్యం తాగునీటిని ఇంటి నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యాహ్న బోజన సమయంలో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంపై ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు ప్రార్థన సమయం అనంతరం గ్రా మంలోని ప్రధాన రోడ్డు వరకు వెళ్లి బైఠాయించారు. ఈ ఘటనపై కలెక్టర్ బీఎం సంతోష్ స్పందించి విచారణకు ఆదేశించడంతో మండల అభివృద్ధి అధికారి చెన్నయ్య, ఇన్‌చార్జి ఎంఈవో వెంకటశ్వర్లు ఆలూరు ఉన్నత పాఠశాలను సందర్శించి హెచ్‌ఎం నాగరాజుతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో విచారణ చేపట్టారు. పాఠశాలలో తాగునీటి కొరతకు గ్రామంలోని స్కావెంజర్ కారణంగా నిర్ధారించారు. ఉద్దేశపూర్వకంగా ఉన్నత పాఠశాలకు వచ్చే వాల్వ్‌ను బంద్ చేయడంతో పాటు పాఠశాలలో ఉన్న బోరును మరమ్మతుకు గుర య్యేలా చేశాడని విచారణ అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదించినట్లు మండల ఇన్‌చార్జి ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

కోస్గి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలోని ఓ కిరాణ దుకాణంలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను గురువారం పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. బాహర్‌పేటలోని చంద్రమౌళి దుకాణంలో సుమారు రూ.8వేల విలువల గల గుట్కాలను పట్టుకొని, యాజమాని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

అగ్రవర్ణ పార్టీల కుట్రలు సహించం

» రేపటి బంద్‌కు సహకరించాలని పిలుపు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న యం.రాఘవాచారి

పాలమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ సాధనకు శనివారం సకల బంద్ సబ్బండ వర్గాల శంఖారావం పూరిస్తున్నట్లు కార్మిక, ప్రజా సంఘాలు, సబ్బండ వర్గాల నాయ కులు ప్రకటించారు. గురువారం జిల్లా కేంద్రంలో ని రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి విద్యావేత్త లక్ష్మణ్‌గౌడ్, జి.గ ట్టన్న అధ్యక్షత వహించారు. న్యాయవాది బెక్కెం జనార్దన్, రమేశ్‌గౌడ్, యం.రాఘవాచారి, ఖలీల్, హనీఫ్‌అహ్మద్, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ఏ.రాములు, బాలకిషన్, మాస్‌లైన్ కార్యదర్శి వెంకటేశ్, మౌలానా, సుందర్ పాల్ ముఖ్య అతి థులుగా హాజరై ప్రసంగించారు. సోషలిజం, సెక్యూలరిజం బీసీల నినాదం కావాలని తెలిపారు. బీసీలే సమాజానికి అగ్రగామి దళంగ నిలవాలన్నారు. మహా నుభావులలో అనేకులు బీసీ సా మాజికవర్గానికి చెందిన వారేనని గుర్తు చేశారు. బ్రాహ్మణీయ ఫాసిజమే దేశ ప్రగతికి ప్రధాన అడ్డంకి అని పేర్కొన్నారు. కార్మిక, ప్రజా సంఘాలు, ముస్లిం, క్రిస్టియన్, మైనారిటీ సంఘాలు, వామపక్ష పార్టీలు, సబ్బండ వ ర్గాలు బీసీ రిజర్వేషన్ ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. రాష్ట్రంలో బీసీలు గంటసేపు రోడ్డుపైకి వస్తే రాజకీయ భూకంపం వస్తుందని అన్నారు. దక్షిణ భారత దేశంలో పెరియార్ రామస్వామి, ఉత్తరభారతదేశంలో రామ్‌మనోహర్ లోహియాలాంటి సోషలిస్ట్ సెక్యులర్ నాయకుల భావజాలమే బీసీలకు సామాజిక గౌరవాన్ని సాధించి చైతన్యాన్ని కలిగించిందన్నారు. బీసీలకు రిజర్వేషన్లను ఆనాడు తిరస్కరించి నందుకు బీఆర్ అంబేద్కర్ తన మంత్రి పదవికే రాజీనామా చేశారన్నారు. తక్షణమే బీసీ రిజర్వేషన్ అమలు చేయకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు మరింత తగ్గిన వరద

గద్వాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణా ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో ప్రాజెక్టుల గేట్లు మూతపడ్డాయి గురువారం శ్రీశైలం ప్రాజెక్టుకు 25వేల క్యూసెక్కుల వరద మాత్రమే వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్టు గేట్లను మూసివేసి విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నారు. కుడి వైపు విద్యుదుత్పత్తి నిలిచిపోగా, ఎడమ విద్యుత్ కేంద్రం ద్వారా 35,315క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.80టీఎంసీలు కాగా ప్రస్తుతం 204.35 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల గేట్లు కూడా మూత పడటంతో జూరాలకు 33వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు గేట్లను మూసివేసి విద్యుదుత్పత్తి ద్వారా 31,215క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల డ్యామ్‌కు 6వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 4వేల క్యూసెక్కులను శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు.

ఆరు యూనిట్లలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు స్వల్పంగా వరద వస్తున్న కారణంగా ఆరు యూనిట్లను ప్రారంభించి విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ప్రాజెక్టు ఎస్ఈ శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్లను ప్రారంభించి 2.912 మిలియ న్ యూనిట్లను, ఇప్పటి వరకు 129.709 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో మూడు యూనిట్లను ప్రారంభించి 3.211 మిలియన్ యూనిట్లను చేపట్టగా, ఇప్పటి వరకు 415.495 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. వరద ఎగువ నుంచి స్వల్పంగా వస్తున్న కారణంగా ఉత్పత్తి కాస్త మందగించిం దని పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

అమ్రాబాద్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-17 పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల ప్రాంతానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. అమ్రాబాద్ మండలం బీకే.తిర్మలాపూర్ చెందిన ఎడ్ల వరప్రసాద్, పదర మండలం జ్యోతినాయక్‌తండాకు చెందిన నితిన్, చెన్నంపల్లి గ్రామానికి చెందిన రఘువీర్ శుక్రవారం నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో రెండు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్టు తరఫున ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ వాలీబాల్ జట్టుకు వరప్రసాద్ క్యాపిటల్‌గా వ్యవహరించనున్నారు. ఈ ముగ్గురు విద్యార్థులకు అచ్చంపేట సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల నిర్వహిస్తున్న అకాడమీలో ప్రస్తుతం వీరు శిక్షణ పొందుతున్నారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

కోడేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని మూలమడ్డాతండాలో ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ గురువారం తెలిపారు. తండాకు చెందిన రాజు (29) బుధవారం రాత్రి భార్యతో డబ్బుల విషయమై గొడవ పడ్డారు. కొద్ది సమయం తరువాత బయటికి వెళ్లి వస్తానని చెప్పి గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్ పిల్లర్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. గురువారం ఉదయం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కుటుంబ సభ్యులతో గొడవపడి..

» పురుగుల మందు తాగి యువకుడి బలవన్మరణం


వెంకటేశ్ (ఫైల్)

ధరూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కొండా శ్రీహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధరూరు మండలం పార్చర్ల గ్రామానికి చెందిన వెంకటేశ్(29) మూడు రోజుల క్రితం ఇంట్లో కుటుంబసభ్యులతో గొడవ పడి బయటి వెళ్లాడు. రెండు రోజుల క్రితం ధరూరు మండల కేంద్రం పార్చర్ల రోడ్డు సమీపంలో పురుగుల మందు తాగి మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన రైతులు పొలాలకు వెళ్లే క్రమంలో దుర్వాసన రావడంతో పోలీసులకు తెలిపారు. ఎస్‌ఐ చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. తమ్ముడు చిన్న వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..


కడిరె లక్ష్మమ్మ (ఫైల్)

ఖిల్లాఘణపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని పర్వతాపూర్ చెందిన కడిరె లక్ష్మమ్మ (45) కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుమారుడు కడిరె కుర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కడిరె లక్ష్మమ్మ ఈనెల 12వ తేదీన స్వగృహంలో గుర్తు తెలియని విష పదార్థం తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించిన అనంతరం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. కుమారుడు కుర్మయ్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

గోపాల్‌పేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది ఎస్‌ఐ నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుద్దారం గ్రామానికి చెందిన ముచ్చమారు రవీంద్రగౌడ్ (36) గతంలో హోంగార్డుగా హైదరాబాద్‌లో పనిచేసేవాడు. మద్యానికి బానిసై విధుల నుంచి వైదొలిగి స్వగ్రామంలోనే ఉంటున్నాడు. గురువారం పనిమిత్తం ఏదుట్ల రోడ్డు సమీపంలో మద్యం మత్తులో నడుచుకుంటూ వెళ్తూ బోర్లాపడి అక్కడికక్కడే మృతి చెందాడు. అటుగా వస్తున్న బాటసారులు చూసి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమచారం అదించారు. భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి..

» చెరువులో పడి వ్యక్తి మృతి

మద్దూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా మద్దూర్‌లో చోటు చేసుకోంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జడ్చర్లకు చెందిన కమ్మరి శేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి మద్దూర్‌కు వచ్చి రవి ఇనుప సామాను దుకాణంలో పని చేస్తూ జీవించేవాడు. ఈ నెల 12న ఉదయం కాలకృత్యాలు తీర్చుకోడానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతని ఆచూకి కోసం వెతికిన ఫలితం లేకుండా పోయింది. గురువారం ఉదయం 11గంటలకు ఓ వ్యక్తి మృతదేహం గ్రామ శివారులోని సంఘం చెరువులో తేలింది. కమ్మరి శేఖర్‌గా కుటుంబ సభ్యులు చూసి గుర్తించారు. మృతుడికి మూర్ఛ ఉండేదని కాలకృత్యాలకు వెళ్లిన సమయంలో మూర్ఛ రావడంతో చెరువులో పడి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి చేసిన దొంగలు

» ఒకరిని పట్టుకొని చితకబాదిన గ్రామస్థులు

మక్తల్, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ మునిసిపాలిటీ పరిధిలోని కొత్తగార్లపల్లిలో గురువారం తెల్లవారుజామున ముగ్గురు దొంగలు బీభత్సం సృష్టించారు. మునిసిపాలిటీ పరిధిలోని గార్లపల్లి గ్రామంలో తెల్లవారుజామున అంజిలప్ప ఇంట్లోకి ముగ్గురు చొరబడ్డారు. ఇంట్లో ఉన్న అతడి కోడలు అనిత మెడలో ఉన్న పుస్తెల తాడును లాక్కునేందుకు ప్రయత్నించగా అడ్డుకున్న అంజిలప్పను దొంగలు తమ వెంట తెచ్చుకున్న సుత్తెతో తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో మహిళ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. దొంగలు పరారయ్యేందుకు యత్నించారు. వారిలో ఓ దొంగను గ్రామస్థులు పట్టుకొని చితకబాది పోలీసులకు అప్పగించారు. మిగతా ఇద్దరు పారిపోయారు.

బైక్‌లను ఎత్తుకెళ్లిన దొంగ పట్టివేత

వెల్దండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బైక్‌లను చోరీకి పాల్పడిన దొంగను బుధవారం రాత్రి పోలీసులు పట్టుకోగా, మరొకరు పరారైన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కురుమూర్తి తెలిపిన వివరాలు ఇలా.. అచ్చంపేట పట్టణానికి చెందిన అనిల్, ఖమ్మం జిల్లా భద్రాచలం చెందిన సంజీవ్ ముఠాగా ఏర్పడి బుధవారం కల్వకుర్తి పట్టణంలో రెండు బైక్‌లను చోరీచేసి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా, మండలంలోని కొత్రతండావద్ద వెల్దండ బ్లూకోట్ కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, రాఘవేందర్‌గౌడ్ వారిని ఆపేందుకు ప్రయత్నించారు. వారు పారిపోయేందుకు యత్నించగా పోలీసులు వెంబడించి వెల్దండ బస్‌స్టేజీ వద్ద పట్టుకున్నారు. అందులో అనిల్ పరారవ్వగా, సంజీవ్ దొరికాడు. స్వాధీనం చేసుకున్న రెండు బైక్‌లను కల్వకుర్తి పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడి బైండోవర్

గద్వాల క్రైం, అక్టోరు 16 (ఆంధ్రజ్యోతి): సంచలనాత్మక సర్వేయర్ తేజేశ్వర్ హత్యకేసులో గురువారం ప్రధాన నిందితుడు తిరుమల్‌రావును గురువారం బైండోవర్ చేసినట్లు గద్వాల సీఐ, ఇన్వెస్టిగేషన్ అధికారి టీ.శ్రీను తెలిపారు. ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ జూన్ 17న అదృశ్యమై కర్నూల్ జిల్లాలోని సుగాలి మెట్టు వద్ద హత్యకు గురైన సంగతి విధితమే. ఇందులో ప్రధాన సూత్రధారి అయిన బ్యాంకు ఉద్యోగి, తిరుమల్‌రావు ఇటీవలే కండిషన్ బెయిల్‌పై విడుదల అయ్యాడు. ఈ క్రమంలో గురువారం సిఐ ఇలాంటి హత్యా సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో తిరుమల్‌రావును బైండోవర్ చేసినట్లు తెలిపారు.

త్వరలోనే నలుగురిపై రౌడీషీట్

హత్యకేసులో పూర్తి వివరాలను సేకరించేలా పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తుంది. అయితే కేసు నుంచి రక్షించేదిశగా నిందితులు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తుంది. ఈ క్రమంలో చాలా వరకు రూ. లక్షల్లో చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. హత్యకేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఏ1 తిరుమల్‌రావుతో పాటు ఏ3 కుమ్మరి నాగేష్, ఏ4 చాకలి పరశురాముడు, ఏ5 చాకలి రాజులపై రౌడీషీట్‌ను శుక్రవారం ఓపెన్ చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తుంది.

ప్రారంభం సరే.. అమలు ఏది?


శ్రీనివాసపూర్‌లో చిన్నారులకు పాఠం బోధిస్తున్న అంగన్‌వాడీ టీచర్

» అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్డు బిర్యానీ బంద్
» ఆదేశాలు వస్తే అమలు చేస్తామంటున్న అధికారులు

వనపర్తి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు చదువుపై ఆసక్తి చూపేందుకు మొదటి దశ అంగన్‌వాడీ కేంద్రమే. అంగన్‌వాడీ కేంద్రంలో చేరి కాస్త విద్యాబుద్దులు నేర్పిన అనంతరం పాఠశాల ప్రవేశం ఉంటుంది. ఆయా కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం సంస్కరణలతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టింది.

ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం ఇప్పటికే కేంద్రాలలో పౌష్టికాహారం అందిస్తుంది. ఈ క్రమంలో జూన్ 11న మంత్రి సీతక్క ఎగ్ బిర్యాని పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా కేంద్రాలలో ఎగ్ బిర్యాని తయారు చేశారు. కేంద్రాల్లో ఉండే బియ్యం పదార్థాలతో రుచికరమైన వారంలో రెండు రోజులు పెట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అందుకు ఆయా కేంద్రాల టీచర్లు కూడా ఉత్సాహం చూపించారు. కానీ ఉన్నతాధికారుల నుంచి పూర్తి ఆదేశాలు అందలేదు.

ఆదేశాలు వస్తే అమలు చేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యాని తయారు చేయడంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. మెనూలో కూడా చేర్చలేదు. ఒకవేళ ఆదేశాలు వస్తే తప్పకుండా అమలు చేస్తాం. కొన్ని కేంద్రాల్లో ఎగ్ బిర్యాని చేస్తున్నారు.

- సుధారాణి, డీడబ్ల్యూఓ, వనపర్తి

ప్రకటనలకే పరిమితం

వనపర్తి జిల్లాలో 589 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, అందులో గర్భిణులు 2,466 మంది, బాలింతలు 1,519 మంది ఉన్నారు. ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు 13,289 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 7,301 మంది ఉన్నారు. కేంద్రాల్లో గర్భిణులకు, చిన్నారులకు నెలకు 16 గుడ్లు ఇస్తారు. అయితే పిల్లలు మరింత బలవర్ధకంగా ఉండేందుకు ఇటీవల ప్రభుత్వం ఎగ్ బిర్యానీ పథకాన్ని తీసుకువచ్చింది. కానీ ఈ పథకం నేటికీ నోచుకోవడం లేదు. ప్రారంభం రోజు మాత్రమే ఎంతో ఉత్సాహంగా ఎగ్ బిర్యానీ భోజనం చేశారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో సొంత ఖర్చులతో బిర్యానీ చేయడం భారంగా భావించిన టీచర్లు పక్కన పెట్టారు. ప్రభుత్వ ఆలోచనలు బాగానే ఉన్నా ప్రకటనలకే పరిమితమైందని పలువురు విమర్శిస్తున్నారు.

అర్ధరాత్రి పోలీసుల తనిఖీ

» మూడు వాహనాలు సీజ్, ఐదు డ్రంకెన్ డ్రైవ్ కేసులు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గద్వాల క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని సీఐ టీ.శ్రీను తెలిపారు. బుధవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలోని కృష్ణవేణిచౌరస్తాలో పట్టణ, రూరల్ ఎస్‌ఐల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అర్ధరాత్రి రోడ్లపై అనవసరంగా ఎవరూ తిరుగరాదన్నారు. మద్యం మత్తులోనే ప్రమాదాలు జరుగుతాయని, దీంతోప్రాణాలు పోయే ప్రమాదం ఉందన్నారు. మద్యం తాగి వాహనాలను నడిపిన ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని మూడు వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్, రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కురుమూర్తి జాతరకు వేళాయె..

» మైదానంలో వెలుస్తున్న గుడారాలు
» 22 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు


జాతర మైదానంలో వెలిసిన హోటల్స్


జాతర మైదానంలో వెలిసిన రంగుల రాట్నాలు

చిన్నచింతకుంట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానుండడంతో జాతర మైదానంలో సందడి నెలకొంది. జాతరకు దుకాణాదారులు, పాలకవర్గం సిద్ధమయ్యారు. బ్రహ్మోత్సవాలతో పాటు జాతరకు కూడా జనం అధికంగా వస్తారు. కురుమూర్తి జాతరకు రాష్ట్రంలోనే ప్రత్యేకమైన స్థానం ఉండడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్ద జాతరగా పేరుంది. దాదాపు బ్రహ్మోత్సవాలు, జాతర 45 రోజుల పాటు కొనసాగుతుంది. ఇప్పటికే జాతర మైదానంలో గుడారాలు వెలుస్తున్నాయి. హోటల్స్ రంగులరాట్నాలు, సర్కస్, వివిధ రకాల స్టాల్స్ మాంసం దుకాణాలను ఏర్పాటు చేయడంలో వ్యాపారులు, నిర్వాహకులు పనులను పూర్తి చేస్తున్నారు. దుకాణాదారులు కూడా తమ స్థలాల్లో ముళ్లపొదలను, పిచ్చి మొక్కలను తొలగిస్తూ చదును చేస్తు దుకాణాలను వేసుకుంటున్నారు. ప్రస్తుతం జాతర మైదానం అంతా కళకళలాడుతుంది.

ఫేక్ లింకులతో మోసం చేసిన ముఠా అరెస్టు

● వివరాలు వెల్లడించిన సీఐ కృష్ణయ్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణయ్య

వనపర్తి రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాల్లో ఫేక్ లింకులు పంపి ప్రజలు డబ్బులు కాజేసిన ముఠాను పోలీసులు పట్టుకున్నారు. గురువారం వనపర్తి పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జనవరి 15న గోపాల్‌పేట మండలం పొలికెపాడు గ్రామానికి చెందిన కావలి శివుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా సైబర్ క్రైమ్, గోపాల్‌పేట పోలీసులు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. దర్యాప్తులో భాగంగా రూ. 2,35,000 విలువైన మోసపూరిత లావాదేవీలను, కారు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ముసాపేట మండలం కనకాపూర్ చెందిన వార్త్యావత్ హర్షవర్ధన్ నాయక్, పాత్లావత్ శ్రీనివాస్ నాయక్, వర్త్యవత్ శంకర్ నాయక్, అంగోత్ గోపాల్ ఒక ముఠాగా ఏర్పడ్డారు. హర్షవర్ధన్ నాయక్ ఢిల్లీ, పాట్నా, బీహార్‌లో సైబర్ నేరాలు చేసి బాధితులను మోసగించి సుమారు రూ.20 లక్షలు సంపాదించాడు. శ్రీనివాస్ నాయక్ సైబర్ నేరగాళ్లకు సహకరించడం, కొంతమందిని అదే ముసుగులో చేర్పించాడు. శంకర్ నాయక్ సైబర్ నేరాలు చేయడం, నేరగాళ్లకు సహ కరించడం చేసేవాడు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మధ్యాహ్న భోజనంలో కప్ప రావడంపై విచారణ

» హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేసిన డీఈఓ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజనంలో కప్ప రావడంపై చర్యలు తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పప్పులో కప్ప రావడంపై గురువారం డీఈఓ అక్షయ పాత్ర ఫౌండేషన్ వంట గదులు, పరిసరాలను పరిశీలించారు. అదేవిధంగా లాల్‌కోట పాఠశాలను పరిశీలించారు. ప్రాథమిక, ఉర్దూ మీడియం పాఠశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాల శుభ్రంగా లేదని హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి వివరణ తీసుకున్నట్లు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎంకు, అక్షయపాత్ర ఫౌండేషన్‌కు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.


పాఠశాలలో విచారిస్తున్న డీఈఓ ప్రవీణ్‌కుమార్

పేలనున్న టపాసులు

» పాలమూరులో 75, జడ్చర్లలో 8 దుకాణాలు
» కొత్త వారికి పాత వ్యాపారుల తిరకాసు
» ఆకర్షిస్తున్న ప్రమిదలు


విక్రయానికి సిద్ధంగా ఉన్న ప్రమిదలు

మహబూబ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి అంటేనే పెద్దఎత్తున టపాసులు సంబురాలు చేస్తుంటారు. ఈ వ్యాపారం రూ.కోట్లల్లో సాగనుంది. అందుకే ఏటా దుకాణాలు పెరుగుతూనే ఉన్నాయి. పాలమూరు నగరంలో 75 దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఇప్పటికే అనుమతులు పొందిన దుకాణదారులు షెడ్‌లను ఏర్పాటు చేసుకునే పనిలో పడ్డారు. జడ్చర్ల పట్టణంలో 8 దుకాణాల ను ఏర్పాటు చేస్తున్నారు. టపాసుల విక్రయాలు, దుకాణాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసుకోవాల్సిన సామగ్రిపై అగ్నిమాపక శాఖ ఇప్పటికే వ్యాపారులకు ఆదేశాలు జారీ చేశారు.

కొత్త వారికి రకరకాల కొర్రీలు

కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేసుకునే వారికి అనుమతుల పేరిట పలు రకాల కొర్రీలు పెడుతున్నారు. అగ్నిమాపక, మునిసిపల్, రెవెన్యూశాఖల అనుమతుల కోసం దాదాపు రూ.50వేల వరకు ఖర్చు చేస్తున్నారు. అన్ని అనుమతులు తీసుకుని దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు వెళితే పాత వ్యాపారులు తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అక్కడ ఉండే యూనియన్ నాయకులు ఖర్చుల పేరిట ప్రతీ దుకాణం నుంచి 25-30 వేలు అడుగుతున్నారు. వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి ఆ ఖర్చంతా ప్రజల మీద తీస్తారు. అయితే పటాకుల బాక్స్‌పై ఉన్న ఎమ్మార్పీ కన్నా 20-25 శాతం తక్కువ ఇస్తున్నా.. 100 శాతం కన్నా ఎక్కువ మార్జిన్ ఉంటుంది. అందుకే దుకాణాలు పెట్టుకోవడానికి చాలా మంది ముందుకు వస్తున్నారు. పాలమూరులో ఈసారి కొత్తగా 10 దుకాణాలు ఏర్పాటు అవుతున్నాయి.


మహబూబ్‌నగర్‌లో ప్రమిదల విక్రయాలు

ఆకట్టుకుంటున్న ప్రమిదలు

పాలమూరులో పలు చోట్ల ప్రమిదలను విక్రయిస్తున్నారు. మట్టి ప్రమిదలను కొనేందుకు జనం ఆసక్తి చూపుతుండటంతో రకరకాల డిజైన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎలక్ట్రికల్‌వి కూడా అమ్మకానికి ఉంచారు.



19న ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా పురుష, మహిళల జట్ల ఎంపికలను ఈ నెల 19న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి బీఎస్‌ఎన్‌ఎల్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖోఖో సంఘం సెక్రటరీ విలియం ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు కోచ్ రాజుకు రిపోర్టు చేయాలని కోరారు.

1,100 లీటర్ల డీజిల్ పట్టివేత

» కర్ణాటక నుంచి తెచ్చి తెలంగాణలో విక్రయం

నారాయణపేట టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుట్ల వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ నుంచి బుధవారం అర్ధరాత్రి అక్రమంగా నారాయణపేటకు బొలెరో వాహనంలో 1,100 లీటర్ల డీజిల్‌ను తరలిస్తుండగా పట్టణ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పట్టుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి విచారించగా వాహన యజమాని కె.చిన్న ప్ప, డ్రైవర్ ఖాజాహుస్సేన్ కర్ణాటక నుంచి డీజిల్ తెచ్చి ఇక్కడ ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు తేలింది. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రధాని పర్యటనతో ట్రాఫిక్ ఆంక్షలు

» అలంపూరు చౌరస్తాలో ఏపీ పోలీసుల విధులు
» కర్నూలు వైపు వెళ్లే వాహనాలన్నీ మళ్లింపు
» జాతీయ రహదారిపై పలుచోట్ల ట్రాఫిక్ జామ్


అలంపూరు చౌరస్తా వద్ద వాహనాలను మళ్లిస్తున్న ఏపీ పోలీసులు

అలంపూరు చౌరస్తా, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు నగర శివారులో గురువారం ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో తెలంగాణలోని 44వ జాతీయ రహదారిపై పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. అలంపూరు చౌరస్తా వద్ద ఏపీలోని పుట్టపర్తి ఎస్‌ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 20మంది పోలీసులు విధులు నిర్వహించారు. అలంపూరుచౌరస్తా మీదుగా కర్నూలు వైపు వాహనాలన్నింటిని దారి మళ్లించారు. కడప, తిరుపతి, నంద్యాల, గుంటూరు వైపు వెళ్లే వాహనాలను అలంపూరు మీదుగా బ్రాహ్మణకొట్కూరు, నందికొట్కూరు వైపు మళ్లించారు. ఇక డోన్, అనంతపూర్, బెంగళూరు వెళ్లే వాహనాలను అయిజ మీదుగా ఎమ్మిగనూరు వైపు మళ్లించారు. కానీ భారీ వాహనాలన్నీ అలంపూరు, అయిజ వైపు వెళ్లే దారుల్లోనే నిలిపేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. సభ పూర్తయిన గంట తర్వాత వాహనాలను వదలడంతో కర్నూలు వైపు వెళ్లే రహదారి కిక్కిరిసిపోయింది. ఎర్రవల్లి నుంచి అలంపూరు చౌరస్తా వరకు వాహనాలు నెమ్మదిగా కదిలాయి.

ఇంటర్వ్యూ..

సాదాబైనామా దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన

- యూసుఫ్ అలీ, తహసీల్దార్, ఊర్కొండ



ఊర్కొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనల మేరకు సాదాబైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తహసీల్దార్ యూసుఫ్ అలీ అన్నారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

సాదాబైనామా అంటే ఏమిటీ ?

సాదాబైనామా అనేది రిజిష్టర్ చేయబడని అమ్మకపు ఒప్పంద పత్రం. దీన్ని సాధారణంగా భూముల అమ్మకం, కొనుగోలు లావా దేవీల కోసం తెల్లకాగితంపై రాసిచ్చే ఒప్పంద పత్రం.

మండలంలో ఎన్ని సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి ?

మండలంలో 2020-21 సంవత్సరంలో సాదాబైనామా 107 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. వాటిని భూభారతిలో భాగంగా ఇటీవలే నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్వీకరించాం.

దరఖాస్తులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన 107 సాదాబైనామా దరఖాస్తులను విక్రయించిన, కొనుగోలుదారులకు నోటీసులు అందించడం జరిగింది. దాంతో పాటు ఆ భూమి ఎవరి స్వాధీనంలో ఉన్నది, సర్వే నంబరు సరియైనదే, కాదా అనే విషయంలో మండల సర్వేయర్, గిర్దావరులు, జీపీవోలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తూ పరిసర ప్రాంత రైతుల అభిప్రాయంతో రిపోర్టులు తయారు చేస్తున్నాము. ప్రభుత్వం నిర్దేశించిన నియమ, నిబంధనల మేరకు జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తున్నాము. వారి సూచనల మేరకు సాదాబైనామాలపై నిర్ణయం తీసుకుంటాము.

న్యూస్ బాక్స్

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

- మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు

అచ్చంపేటటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని 10వ వార్డులో సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. పట్టణంలోని కాలనీలలో త్వరలో పర్యటించి సమస్యల పరిష్కారానికై కృషి చేస్తామన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

సఖి కేంద్రం సేవలపై అవగాహన

కొల్లాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉన్న విద్యార్థులకు సఖి కేంద్రం సేవలపై సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పుట్టపాగ సునీత, లీగల్ కౌన్సెలర్ సరిత మాట్లాడుతూసఖి అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, తాత్కాలిక షెల్టర్, పోలీస్ సపోర్టు, వైద్య సేవలు, లీగల్ సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్స్, ఉమెన్ హెల్ప్ లైన్ 181, 100 డయల్ 14567 వృద్ధుల హెల్ప్‌లైన్ గురించి అవగాహన కల్పించాకె, ఈ కార్యక్రమంలో భాగంగా స్కూల్ ప్రిన్సిపాల్, ఇతర టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత్వంతోనే మానవాళి మనుగడ

- ప్రముఖ సందేశకుడు మహమ్మద్



సందేశం ఇస్తున్న మహమ్మద్

వెల్దండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు అంతరాలు వీడి మానవత్వంతో మెలిగితేనే మానవాళి మనుగడ సాగుతుందని ప్రముఖ సందేశకుడు మహమ్మద్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో వెల్దండ యూత్‌కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహమ్మద్ పాల్గొన్నారు జీవితంలోని వాస్తవాలు, సమస్యల పరిష్కారంపై ఆయన సందేశం ఇచ్చారు. కులమతాలకు అనుగుణంగా కలిసిమెలిసి జీవించడమే పవిత్ర ధర్మమని అన్నారు. ప్రతీ ఒక్కరు తల్లిదండ్రులకు సేవచేయాలని అన్నారు. మతాలను బట్టి మనుషులను విభజించరాదని, కేవలం మానవత్వమే పరమావధిగా మెలగాలని మహమ్మద్ కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, ఎండీ రసీద్, హమీద్, షంషు, రహమాన్, కృష్ణారెడ్డి, పుల్లయ్య, ఖలీల్ తదితరులు ఉన్నారు.

దారి పొడవునా కష్టాలు

- మోకాళ్ల లోతు దిగబడుతున్న బాట
- బాగు చేసి బాధలు తీర్చాలని రైతులు, ప్రజల వేడుకోలు



బురదమయంగా మారిన గట్టురాయిపాకుల బాట

తెలకపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దారి పొడవునా రైతులకు కష్టాలు తప్పడం లేదు. మోకాళ్ల లోతుగా బురదమయంగా మారిన బాట బాగు చేయాలంటూ వేడుకుంటున్నారు. ఈ పరిస్థితి తెలకపల్లి మండల పరిధిలోని గట్టురాయిపాకుల నుంచి పెద్దపల్లికి వెళ్లే మట్టి బాటలో నెలకొన్నది. దారి పొడవునా గుంతలమయమై పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డును బీటీగా మారుస్తామన్న పాలకుల హామీ నీటి మూటగానే మిగిల్చారు. ఇటీవల భారీవర్షాల కారణంగా బాటమొత్తం నీళ్లు నిలిచి బురదమయంగా మారి ముందుకు కదలలేక పోతున్నాయి. తమ గోడు పట్టించుకునే వారు ఎవరని రైతులు గగ్గోలు పెడుతున్నారు. కనీసం గుంతల్లో మట్టిపోసైనా బాటను సరిచేయాలని వేడుకుంటున్నారు. ఈ బాట బీటీగా మారిస్తే ఇక్కడి నుంచి కొల్లాపూర్‌కు గాని, నాయినోనిపల్లి మైసమ్మ దేవత దర్శనానికి వెళ్లడానికి చాలా దగ్గర అవుతుంది. కనీసం బైకు వెళ్లేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి దాపు రించిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ట్రాక్టర్లు, ఎద్దులబండ్లు బురదలో దిగబ డిపోతున్నాయి. దాంతో రైతులు త మ పొలాలకు వెళ్లలేని పరిస్థితి. ఇదే పరిస్థితి తెలకపల్లి నుం చి పశువుల సంత పక్క నుంచి గ ట్టునెల్లికుదురు బాటకూడా పూర్తిగా బురదమయంగా మారిపోయింది. మండల కేంద్రంలోని సీఎల్‌ఆర్ కళాశాల నుంచి పొలాలకు వెళ్లే బాట కూడా ఇలాంటి వాహనాలు కనీసం కాలిబాటన కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.

రోడ్డు నిర్మించి బాధలు తీర్చాలి



గట్టురాయిపాకుల నుంచి పెద్దపల్లి గ్రామాలను కలుపుతూ ఉన్న మట్టి రోడ్డును బాగు చేసి ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు తీర్చాలి. ఈ రోడ్డు బాగా లేకపోవడం వల్ల ఇక్కట్లు ఎదుర్కొంటున్నాం. చిన్నపాటి వర్షం వస్తే బురదమయంగా మారి మోకాళ్ల లోతున బాట దిగబడి మహిళలు, కూలీలు నానా రకాల అవస్థలు పడుతున్నారు. గత పాలకులు రోడ్డును బాగు చేస్తామని మాట ఇచ్చి మరిచారు. ప్రస్తుత పాలకులైనా ఈ రోడ్డుకు మరమ్మతులు చేసి మహర్దశ కల్పించాలి.

- కనుకు కాశన్న, గట్టురాయిపాకుల

అనర్హులకు ఇళ్లు కేటాయిస్తే...

అధికారులపై కఠిన చర్యలు

- కలెక్టర్ బదావత్ సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ బదావత్ సంతోష్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, అదనపు కలెక్టర్ దేవసహాయంతో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ అధికారులతో అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ టి.అశోక్, హౌసింగ్ పీడీ సంగప్ప, డిప్యూటీ సీఈవో గోపాల్‌నాయక్, పీఆర్‌ఈఈ విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులను ఎలాంటి ఒత్తిడికి గురి చేయకూడదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బెస్ట్‌అవైలబుల్ స్కూళ్ల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. పాఠ్యాంశాల బోధన, వసతుల కల్పనలో వివక్ష చూపకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్య క్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉమాపతి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్ బెస్ట్ అవైలబుల్ పాఠశాలల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తపాలా ద్వారా పంపిణీ చేయాలి

నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులను తపాలా ద్వారా పంపిణీ చేసే విధానాన్ని అమలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికార కార్యాలయం నుంచి ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికా రులు, కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులు, తహసీల్దార్లతో రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల వివరాలను సక్రమంగా నవీకరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట ఆర్డీవోలు సురేష్‌బాబు, మాధవి, బన్సీలాల్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం



మాట్లాడుతున్న కాలనీవాసులు జైపాల్ నాయక్, భాస్కర్

అచ్చంపేటటౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని న్యూ వెంకటేశ్వర కాలనీలోని సమస్యలు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కౌన్సిలర్ సునీతాశ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని కాలనీవాసులు జైపాల్ నాయక్, దూమర్ల భాస్కర్ అన్నారు. గురువారం పట్టణంలోని న్యూ వెంకటేశ్వర కాలనీలో ప్రధాన సమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నూతన కాలనీలో డ్రైనేజీలు, సీసీరోడ్లు వంటి సమస్యలు మునిసిపల్ అధికా రులదృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు ప్రభాకర్, శ్రీనివాసులు, రామో జీ, ప్రకాష్, మల్లేష్, లోకేష్, కుమార్, అరవింద్, మహేష్, శంకర్, ప్రవీణ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలి : డీఎస్పీ శ్రీనివాస్



పదర పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

పదర, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు. ఆయన గురువారం పదర పీఎస్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లోని రికార్డులు, సాంకేతిక పనిముట్లు, తుపాకులను ఆయన పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో ధైర్యం నింపేలా కౌన్సెలింగ్ ఇవ్వాలని సిబ్బందికి తెలిపారు. సీఐ శంకర్‌నాయక్, పదర ఎస్‌ఐ సద్దాం హుసేన్, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతులు ఉన్నందున మండలంలోని తాడూరు, యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్, వెంకటాపూర్, గుంతకోడూరు, యంగంపల్లి, అల్లాపూర్, గుట్టలపల్లి, పొల్కారు, మేడిపూర్, నాగదేవ్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు



నాగర్‌కర్నూల్‌లో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కందనూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 9వ షెడ్యూల్లో చేర్చి బీసీలకు రాజకీయపరంగా 42 శాతంరిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నాగర్‌క ర్నూల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. పర్వతాలు మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని గత ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీలో భాగంగా రాష్ట్ర శాసన సభలో బిల్లు పెట్టి దానిని గవర్నర్ రాష్ట్రపతికి పంపించినా ఆ బిల్లుకు ఆమోదం తెలపకుండా కేంద్ర ప్రభుత్వం నాన్చడం వల్ల బిల్లు అమలు కాలేదని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య, నాయకులు మధు, మురళి, సుధాకర్, ఆంజనేయులు, రామచంద్రి, రవి, కాజా, లక్ష్మయ్య పాల్గొన్నారు.

● కొల్లాపూర్, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి శివ వర్మ ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లోని గాంధీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు బత్తిని రాజు, బాలు యాదవ్, శివ శంకర్, కురుమయ్య, కిష్టయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బంద్‌ను జయప్రదం చేయాలి

-అఖిలపక్ష పార్టీల జేఏసీ పిలుపు



కల్వకుర్తిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్వకుర్తి,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం హైకోర్టు ఇచ్చిన స్టేకు నిరసనగా రాష్ట్ర బీసీ జేఏసీ పిలుపు మేరకు ఈ నెల 18న జరపతలపెట్టిన తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని కల్వకుర్తి బీసీ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. కల్వకుర్తి పట్టణంలోని తెలంగాణ జేఏసీ శిబిరం వద్ద గురువారం తెలంగాణ బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. తెలంగాణలో ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు తమ సంపూర్ణ మద్దతును తెలియజేయడం జరిగిం దని వారు పేర్కొన్నారు. అదేవిధంగా బీసీ రిజ ర్వేషన్లు సాధించే వరకు ఐక్యంగా అందరినీ కలుపుకుని వియవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, జేఏసీ చైర్మన్ సదానందగౌడ్, బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ అధ్యక్షుడు రాజేందర్, బహుజన మేధావి కానుగుల జంగయ్య, కల్వకుర్తి సీపీఐ నాయకులు పరశురాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్.వీరస్వామి, శేఖర్, ఊర్కొండ మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఎల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

● అచ్చంపేటటౌన్, (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్లు సాధించుకునే వరకు ఉద్యమం ఆపేదిలేదని బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు బాలాజీ అన్నారు. నేడు బీసీ సంఘాలు తలపెట్టిన బంద్ కరనపత్రాని గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విడుదల చేశారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజు, రవీందర్, వెంకటేష్, అనిల్, మల్లయ్య, అజయ్ పాల్గొన్నారు.

బంద్‌కు ఏఐఎస్‌ఎఫ్, సీపీఐల మద్దతు

కందనూలు, (ఆంధ్రజ్యోతి) : బీసీజేఏసీ చేపట్టిన రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, ప్రేమ్‌కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీల 42శాతం రిజర్వేషన్ల బిల్లు సాధనకై జరిగే ప్రతీ ఉద్యమంలో సీపీఐ ముందుంటుందని ఫయాజ్ తెలిపారు. రాష్ట్ర బంద్‌లో జిల్లా వ్యాప్తంగా సీపీఐ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థి దశలోనే సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

- ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాములు

బిజినేపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో హఠన్మారణాలను నిరోధించేందుకు ప్రతీ ఒక్కరు సీపీఆర్ విధానంపై విద్యార్థి దశలోనే పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్వీ ప్రభుత్వ సైన్స్ అండ్ ఆర్ట్స్ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాములు అన్నారు. మండలంలోని పాలెంలోని ప్రభుత్వ వెంకటేశ్వర అటానమస్ డిగ్రీ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు సీపీఆర్‌పై ప్రత్యేక అవగాహన కల్పించి మాట్లాడారు. చుట్టు పక్కల ఎవరికైనా హఠాత్తుగా గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడి ప్రాణదాతలు కావొచ్చని అన్నారు. సీపీఆర్ ద్వారా ఆగిన గుండె తిరిగి కొట్టుకోవడం ప్రారంభించి ప్రాణాపాయం తప్పుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుష్మ, ప్రోగ్రాం కన్వీనర్ నాగరాజు, మెంబర్స్ వర్కాల శ్రీనివాసులు, శివ, ప్రియాంక, 108 ఇన్‌చార్జీ శ్రీనివాసులు, ఎంపీహెచ్ఓ రాజేశ్వర్, హెల్త్ అసిస్టెంట్ గోవర్దన్, అధ్యాపకులు రాధాకుమారి, స్వప్న, నాగలింగం, మనోజ్ కుమార్, యాదగిరి, ప్రవలీత, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ చౌరస్తాలో షెడ్ల ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న వీధి వ్యాపారులు

కందనూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో 30ఏళ్లుగా వ్యాపారాలు చేస్తున్న చిరువ్యాపారులు తమకు షెడ్లు ఏర్పాటు చేయాలని గురువారం వీధి వ్యాపారుల సంఘం నాయకులు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వీధి వ్యాపారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పొదిల రామయ్య, యాదగిరి మాట్లాడుతూ వీధి వ్యాపారుల ఇబ్బంది గురించి ఎమ్మెల్సీకి వివరించారు. స్పందించిన ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి డ్రైనేజీ ఎత్తు తగ్గించి వ్యాపారులు సౌకర్యంగా వ్యాపారం చేసుకునేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వీధి వ్యాపారులు యాదగిరి, మురళి, రామచంద్ర, ఖాజా, నరసింహ, సుధాకర్, లక్ష్మయ్య, ఆంజనేయులు, రవి, శ్రీనివాసులు, స్వరూప,సుజాత, సైదమ్మ, శశికళ పాల్గొన్నారు

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

-డీఈవో రమేష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ కుమార్

కందనూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల, సుబ్రహ్మణ్య దేవస్థానం వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల, తూడుకుర్తి, కార్వంగ ప్రాథమిక పాఠశాలలను గురువారం డీఈవో తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రమాణాలను డీఈవో పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని శారద మెమోరియల్ ప్రైవేట్ పాఠశాలను డీఈవో పరిశీలించారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు వెంకటయ్య, నూరుద్దీన్, అధికారులు ఎంఈవో భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

● ఉప్పునుంతల, (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని డీఈవో రమేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 69వ జిల్లా స్థాయి చదరంగ పోటీల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పోటీలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి 210మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థుల కు అండర్17లో బాలురు బాలికలకు బహుమతులను అందించారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎంఈవో చంద్రశేఖర్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, పాండు, సీతారాం, యాదయ్య గౌడ్, నిరంజన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ



రైతులకు వేరుశనగ విత్తనాలు అందజేస్తున్న నాయకులు

కొల్లాపూర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : రైతు వ్యవసాయ ఉత్పత్తిదారుల ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ద్వారా రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ మండల రైతులకు 100శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. కొల్లాపూర్‌లోని రైతు వేదికలో రత్నగిరి ఫౌండేషన్ డైరెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ ఏడీ హుస్సేన్ హాజరయ్యారు. వీరితో పాటు మాజీ ప్రజాప్రతినిధులు హాజరై లబ్ధిదారులకు, విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 1200 మందికి పైగా రైతులకు ఈ విత్తనాలను ఎకరాకు 100 కిలోల చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, చైల్డ్ కేర్ సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, నాయకులు హనుమంత్ నాయక్, రఘుపతి రావు, శేఖర్‌రెడ్డి, పసుపుల నర్సింహ, ఇక్బాల్, శ్రీనివాసులు, వంగ రాజశేఖర్ గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను పరిశీలించిన ఆర్డీవో



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో, తహసీల్దార్

కల్వకుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తిలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలను గురువారం ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీంలు సందర్శించారు. ఆశ్రమ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కావాల్సిన వసతులు ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయించారు. ఎస్టీ హాస్టల్స్ ఎస్టీ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న డైలీవేజ్ వర్కర్లు సమ్మెబాట పట్టడంతో విద్యార్థులకు భోజనాలు వండి పెట్టడానికి ఇబ్బందులు నెలకొన్నాయని, అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని డీటీడీవో ఫిరంగి హామీ ఇచ్చారు. అనంతరం ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, తహసీల్దార్ ఇబ్రహీం, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ షానవాజ్‌ఖాన్‌లు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని వారు సూచించారు.

పశువులకు టీకాలు

తాడూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కొనసాగుతున్న గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని గురువారం జిల్లా పశువైద్యాధికారి జ్ఞానశేఖర్ తనిఖీ చేశారు. పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని రైతులకు సూచించారు.

● తిమ్మాజిపేట (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడుపర్తి, చేగుంట, రాళ్లచెరువుతండాల్లో గురువారం పశువైద్య శిబిరాలు నిర్వహించి, 401 తెల్లజాతి పశువులకు 379నల్లజాతి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పశువైద్యాధికారి శ్రావణి, పశువైద్య సిబ్బంది విజయలలిత, తిరుపతయ్య, ఖాదర్, యాదగిరి, శాంతయ్య, రవి, గోపాలమిత్రలు ఉన్నారు.

● వంగూరు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి సంతోష్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు ముకురాల రామార్జున్ డిమాండ్ చేశారు. ఎస్టీ హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న డైలీవేజ్ సిబ్బంది సమ్మె చేయడం వల్ల విద్యార్థినులు భోజనాలకు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించేలా చూడాలని డీటీడీవో ఫిరంగికి ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు ఇమ్రాన్, అశోక్, రాజేశ్, సత్యం, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి భూమి పూజ

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఇల్లు లేని ప్రతీ నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వం మంజూరు చేస్తుందని ఆ గ్రామ మాజీ సర్పంచ్ వి.సత్యం అన్నారు. గురువారం మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామంలో కావలి శ్రీనుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరవగా ఆయన భూమి పూజ చేశారు.

ఫారెస్టు అధికారుల కోసం ఎదురు చూపు

- వెనుదిరిగిన రెవెన్యూ అధికారులు

లింగాల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాయవరం రెవెన్యూ శివారులోని 83 సర్వే నెంబరు భూ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కలెక్టర్ ఆదేశాల మేరకు గతంలో ఆర్డీవో ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి రైతులు గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించినప్పటికీ ఫారెస్టు అధికారులు చొరవ చూపడం లేదని రైతులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తహసీల్దార్ పాండునాయక్ ఫారెస్టు అధికారులకు, రైతులకు, గ్రామస్థులకు సమాచారమిచ్చి గురు వారం 83 సర్వే నెంబరు క్షేత్రస్థాయి పరిశీలన కోసం రెవెన్యూ అధికారులు వెళ్లారు. రైతులు, గ్రామస్థులతో కలిసి రెవెన్యూ అధికారులు ఫారెస్టు అధికారులకై గంటల తరబడి వేచి చూసి పలుమార్లు సెల్‌ఫోన్‌కు కాల్ చేసిన ప్రయోజనం లేకపోవడంతో చేసేదిలేక వెనుది రిగారు. 83రెవెన్యూ సర్వే నెంబరులో గల 1398 ఎకరాల 10గుంటల పోరంబోకు భూమిలో గత సుమారు 70ఏళ్ల నుంచి మోఖా మీద ఉంటూ సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమ కుటుంబాలకు ఈ భూమే పెద్ద దిక్కు అని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఈ భూమి విషయంలో రెవెన్యూ, అటవీశాఖల మధ్య సరిహద్దు అంశం తలెత్తడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నట్లు వాపోయారు.

వరి కొనుగోళ్లపై శిక్షణ

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు ఖరీఫ్‌లో వరి కొనుగోళ్లపై డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ రాజేశ్వరి వెలుగు సిబ్బందికి శిక్షణనిచ్చారు. డీపీఎం కృష్ణయ్య, శ్రీనిధి ఆర్ఎం నరసింహారావు, ఎంపీడీవో నాగేంద్రం, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి మండలాల ఏపీఎంలు సంతోష్, తిరుపతయ్య, గౌస్, అరుణ, ఏటీఎంలు,వీవోఏలు, సీసీలు పాల్గొన్నారు.